సాక్షి మెదక్

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



పోలీసుల కార్డన్ సెర్చ్

కౌడిపల్లిలో మంగళవారం నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డితోపాటు 30 మంది పోలీసులు కొత్త కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 8లో



బతికుండగానే చంపేశారు

ఆస్తి కోసం తమ్ముడి మరణ ధ్రువపత్రం సృష్టించాడు ఓ అన్న. ఈ ఘటన తూప్రాన్ మండలంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. 8లో



అంధత్వ నివారణే లక్ష్యం 9లో

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత పేర్కొన్నారు. మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి పోలీస్ యాక్ట్ అమలు

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజులు (ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ రోహిణీప్రియదర్శిని తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని తెలిపారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టొదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలన్నారు.

మెరుగైన విద్యనందించాలి

జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రమేశ్ కుమార్

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ తెలిపారు. మంగళవారం టేక్మాల్ మండలం ఎల్లంపల్లి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో జరిగే మన ఊరు–మన బడి పనులను పరిశీలించిన ఆయన తరగతి గదుల్లోని విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టాలని సూచించారు. మన ఊరు– మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎస్‌ఎంసీ చైర్మన్‌కు సూచించారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు ఉన్నారు.

అర్హులందరికీ పరీక్షలు చేయండి


డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయనిర్మల



తనిఖీ చేస్తున్న విజయనిర్మల

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయనిర్మల మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్, ఓపీ, వైద్యపరీక్షలు, అద్దాల పంపిణీని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయాలన్నారు. విధుల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి పురుగుల బియ్యం



పురుగులు పట్టిన బియ్యం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పురుగులు పట్టిన సన్నబియ్యంతో పెడుతున్నారు. పెద్దశంకరంపేట గోదాం నుంచి పాఠశాలలకు ఇష్టం వచ్చిన బియ్యం సరఫరా చేస్తున్నట్లు టీచర్లు చెబుతున్నారు. ఒక బస్తా సన్న బియ్యం, మరో బస్తా దొడ్డి బియ్యం సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ఇటీవల ఎంఈఓ గోదాం ఇన్‌చార్జ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఫలితం లేదన్నారు. పౌర సరఫరా గోదాం అధికారులు ఏ బియ్యం పంపితే వాటితోనే మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

డబుల్ పట్టాలెక్కేనా?

కేంద్ర బడ్జెట్‌లో నిధులపై ఆశ

- రెండు లైన్లకు రైల్వే అధికారుల అనుమతి
- మేడ్చల్–ముత్ఖేడ్ వరకు ప్రతిపాదనలు



మీర్జాపల్లి రైల్వేస్టేషన్

చిన్నశంకరంపేట(మెదక్): జిల్లా మీదుగా సికింద్రాబాద్–నిజామాబాద్ రైల్వే డబుల్ లైన్ పనుల ప్రతిపాదనలకు రైల్వేబోర్డు ఆమోదముద్ర వేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రైల్వే డబుల్ లైన్‌తోపాటు ఎలక్ట్రిషియన్ పనుల నిర్వహణకు అవసరమైన నిధుల మంజూరుకు రైల్వే అధికారులు ప్రతిపాదనలు ఆమోదించారు. ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరైతే మేడ్చల్ నుంచి ముత్ఖేడ్ వరకు డబుల్ లైన్ పట్టాలు వేసేందుకు మార్గం సుగమం అవుతుంది.

- నిజాం కాలంలో జిల్లా మీదుగా ఔరంగాబాద్, ముంబయి వరకు రైల్వే లైన్ నిర్మాణం చేపట్టారు. సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్రను కలుపుతూ మొదట మీటర్ గేజ్ రైల్వే నిర్మాణం చేపట్టారు.
- ఈ సమయంలో సికింద్రాబాద్–నిజామాబాద్ రైల్వేలైన్ మధ్యలో సెంటర్ పాయింట్‌గా చిన్నశంకరంపేట మండలంలోని మీర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు ఇంజిన్‌లో బొగ్గు, వాటర్ నింపుకునేందుకు ఏర్పాట్లు చేశారు.
- అప్పట్లో రైల్వే సిబ్బందికి భోజన ఏర్పాట్లు, వసతికి అవసరమైన రన్నింగ్ రూమ్ సౌకర్యం ఉండేది.
- బీజేపీ ప్రభుత్వ హయాంలో ఈ లైన్‌ను బ్రాడ్‌గేజ్ లైన్‌గా మార్చారు. రైళ్ల సంఖ్య పెరిగినప్పటికీ రాకపోకలు జరిగేటప్పుడు క్రాసింగ్‌కు ఎక్కువ సమయం తీసుకోవడంతో మరిన్ని రైళ్లు నడపలేకపోతున్నారు.
- దీనికితోడు ప్రయాణికులకు కూడా రైలు క్రాసింగ్ సమయంలో గంటల కొద్ది సమయం కూడా వృథా అవుతుంది.
- ప్రస్తుతం మహారాష్ట్రలోని ముత్ఖేడ్ నుంచి మెదక్ జిల్లా మీదుగా మేడ్చల్ వరకు 418 కిలోమీటర్ల రైలు మార్గం డబుల్‌లైన్‌గా మార్చేందుకు రూ.4,686 కోట్లతో రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రైల్వేబోర్డు అనుమతిని పొందారు.
- త్వరలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో నిధులు మంజూరు కానున్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

రానున్న బడ్జెట్‌లోనే నిధులు..

- వచ్చే బడ్జెట్‌లోనే కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు.
- దక్షిణ మధ్య రైల్వేలో కీలకంగా ఉత్తరాది రాష్ట్రాలను లింక్ చేసి దూరం తగ్గేందుకు అవకాశం ఉన్న ఈ లైన్‌కు ప్రాధాన్యం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు ఇప్పటికే డబుల్ లైన్ ఉంది.
- ఇదే సమయంలో జిల్లాలోని మనోహరాబాద్, మాసాయిపేట, వడియారం, మీర్జాపల్లి, అక్కన్నపేట మీదుగా కామారెడ్డి, నిజామాబాద్, బాసర నుంచి మహారాష్ట్రలోని ముత్ఖేడ్ వరకు డబల్ లైన్ పూర్తి చేయనున్నారు.
- ఈ పనులు పూర్తయితే మహారాష్ట్రలోని డబుల్‌లైన్‌కు లింక్ ఏర్పడి ముంబయి నుంచి మరిన్ని రైళ్లు జిల్లా మీదుగా సికింద్రాబాద్‌కు వెళతాయి.
- నిధుల అంశంపై జిల్లా ఎంపీలు కొత్తప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్ దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



సికింద్రాబాద్–నిజామాబాద్ రైల్వే మార్గం డబుల్‌లైన్‌గా మారితే జిల్లావాసులకు వరం. మీటర్ గేజ్ రైలు మార్గంగా ఉన్నప్పటి నుంచి స్థానికులు, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రైల్వే మార్గంతో ఎంతో అభివృద్ధి చెందింది. డబుల్ లైన్ మారితే మరింత వ్యాపార అవకాశాలు, రాకపోకలకు సులువుగా ఉంటుంది. రైల్వే బోర్డు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్, మీర్జాపల్లి

గంటలోపు సికింద్రాబాద్‌కు ప్రయాణం



సికింద్రాబాద్–నిజామాబాద్ రైలు మార్గంలో డబుల్ లైన్ ఏర్పడితే మీర్జాపల్లి నుంచి గంటలోపు సికింద్రాబాద్‌కు చేరుకోవచ్చు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో సౌకర్యం ఉంటుంది. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, కూలీలు కూడా లబ్ధి పొందనున్నారు.

–సంగని సంజీవ్, మీర్జాపల్లి

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి



చెక్కు అందజేస్తున్న దేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా కల్పిస్తుందని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మెదక్ పట్టణ, హవేలిఘనపూర్, పాపన్నపేట మండలాలకు చెందిన 86 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 27,99,500 విలువ గల చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ జయరాజ్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్, మొహిద్దీన్, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాశం వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కుమ్మరి జగన్, మెదక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిలు , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, ప్రభు రెడ్డి, బొద్దుల కృష్ణ, నాయకులు సాంబశివరావు, మ్యాకల సాయిలు, శంకర్ శ్రీనివాస్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ముమ్మరంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: ప్రతీ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉపాధి హామీ పనులు, పంచాయతీ అవార్డులు, మైనార్టీలకు యూనిట్ల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో 50 మందికి తగ్గకుండా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. బుధవారం నుంచే కూలీలకు పనులు కల్పించడానికి పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎంలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లాలో ఇంత వరకు 270 తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని, మిగతా ప్రాంతాల్లో స్థలాలను ఎంపిక చేసి నిర్మాణాలు చేపట్టాలన్నారు. పంచాయతీ అవార్డులను సమీక్షిస్తూ ఆదర్శమైన గ్రామ పంచాయతీ అంటే 9 అంశాలలో సుస్థిర అభివృద్ధి సాధించి ఉండాలని, వాటికి కేంద్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 24, 2024న జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రధానం చేస్తుందన్నారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి షార్ట్ లిస్ట్ రూపొందించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. మైనార్టీ వర్గాల యూనిట్లపై సమీక్షిస్తూ 80 శాతం సబ్సిడీతో లక్ష రూపాయలలోపు 39 యూనిట్ల మంజూరు, 70 శాతం సబ్సిడీ తో రెండు లక్షల లోపు 17 యూనిట్ల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించగా నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల నుంచి 2,239 దరఖాస్తులు వచ్చాయని, వాటిని ప్రభుత్వ మార్గదర్శకాల కనుగుణంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధి దారుల జాబితా రూపొందిస్తున్నామ ని అన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ శైలేష్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ సాయిబాబ, మైనార్టీ అధి కారి జెంలా నాయక్, మున్సిపల్ కమిషనర్లు జానకీరామ్ సాగర్, మోహన్, వెంకట గోపాల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

సైనికుల సేవలు మరువలేనివి

అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: సైనికుల సేవలు వెలకట్టలేనివని, వారికి అన్ని విధాల ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తామని అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో జిల్లా సైనిక్ బోర్డు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. ఉమ్మడి జిల్లా సంగారెడ్డిలో ఉన్న జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి వెళ్లడం ఇబ్బందిగా ఉందని, మెదక్‌లో కూడా కార్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలని సభ్యులు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మాజీ సైనికులకు 5 ఎకరాల భూమి ఇవ్వాల్సి ఉండగా 1993 తర్వాత ఇంతవరకు భూములు ఇవ్వడం లేదని, ఇచ్చిన భూములకు ఇంతవరకు ఎన్ఓసీలు ఇవ్వడం లేదని సభ్యులు తెలుపగా మీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బోర్డు ఉపాధ్యక్షుడు మల్లేశం, సభ్యులు రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శంకర్ రావు, పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌గా రాజర్షిషా

రంగారెడ్డి జిల్లాకు హరీశ్ బదిలీ



కలెక్టర్ రాజర్షిషా

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా కలెక్టర్‌గా రాజర్షిషా నియమితులయ్యారు. ఇక్కడ కలెక్టర్‌గా దాదాపు రెండేళ్లు పనిచేసిన హరీశ్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా పని చేస్తున్న రాజర్షిషాను మెదక్ కలెక్టర్‌గా నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన రాజర్షిషా 2020 ఫిబ్రవరి 10న సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సుమారు మూడేళ్లపాటు సంగారెడ్డిలో పనిచేశారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాజర్షిషా కాన్పూర్ ఐఐటీలో చదివారు. ముందు కరీంనగర్ జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ప్రభుత్వం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చింది.

సమర్థవంతమైన అధికారిగా పేరు

రాజర్షిషాకు సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. విధుల పట్ల నిక్కచ్చిగా వ్యవహరిస్తారనే పేరుంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పాలన వ్యవహారాలను ఆయన సమర్థవంతంగా పర్యవేక్షించగలిగారు. మంత్రి హరీశ్‌రావు వద్ద కూడా ఆయనకు మంచి అధికారిగా పేరుంది. సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన ఏదైనా కార్యక్రమాలను, పథకాలకు సంబంధించి పర్యవేక్షణ బాధ్యతలను మంత్రి హరీశ్‌రావు రాజర్షిషాకే అప్పగించేవారు. మెదక్ కలెక్టర్‌గా నియమించినందుకు ఆయన మంత్రి హరీశ్‌రావు కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం.

రూ.150 కోట్లతో 'మన ఊరు-మన బడి' పనులు

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- నేడు పాఠశాలలు ప్రారంభం

అల్లాదుర్గం(మెదక్): జిల్లాలో 310 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు– మన బడి పథకం కింద రూ.150 కోట్లతో పనులు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మంగళవారం అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. బుధవారం జిల్లావ్యాప్తంగా మూడు పాఠశాలలను ప్రారంభిస్తున్న సందర్భంగా పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతీ నియోజకవర్గం నుంచి వంద శాతం పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో చిన్న శంకరంపేట మండలం గజగట్లపల్లి, శివ్వంపేట మండలం పిల్లుట్ల, అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి పాఠశాలలను ప్రారంభిస్తున్నాం అన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. రూ.37 లక్షలతో కాయిదంపల్లి పాఠశాల, రూ.58 లక్షలతో పిల్లుట్ల పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్యానాయక్, సర్పంచ్ బేతయ్య, హెచ్‌ఎం రాంజానాయక్, ఎంపీఓ సయ్యద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



విద్యార్థినులతో జడ్జి అనిత, పోలీసులు

నర్సాపూర్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జడ్జి కె.అనిత అన్నారు. మంగళవారం ఆమె పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్‌లో భోజనం ఎలా ఉంటుందని, ఇతర వసతులు ఎలా ఉన్నాయని, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం, స్నాక్స్ పెట్టాలని హాస్టల్ సంక్షేమ అధికారి లలితకు సూచించారు. అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని అంకితభావంతో లక్ష్యసాధన కోసం చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని జడ్జి సూచించారు. అసంఘటిత సమస్యలు తలెత్తినప్పుడు 100 నంబర్‌కు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆమె వెంట ఎస్ఐ శ్రీనివాస్, న్యాయవాది స్వరూపరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికి మాంద్యం దెబ్బ!

- అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులు
- పడిపోయిన గింజలు, క్యాండీ ధరలు
- క్వింటాల్‌కు ధర రూ.7,700కే పరిమితం
- ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై పరిశీలన



గజ్వేల్‌లోని ఓ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు

గజ్వేల్: పత్తికీ మాంద్యం దెబ్బ తగిలింది. గతేడాది క్వింటాల్‌కు రూ.10వేలకుపైనే పలికిన ధర ఈ ఏడాది రూ.7,700 వద్దే నిలిచిపోయింది. రెండు నెలల క్రితం స్వల్ప కాలం రూ.9 వేల పైచిలుకు పలికి మురిపించింది. తర్వాత మరింత పెరగవచ్చున భావిస్తే అందుకు భిన్నంగా తగ్గుతూ వస్తుంది. ఈ పరిస్థితితో రైతులు పత్తిని అమ్ముకోకుండా ఇళ్ల వద్దనే నిల్వ చేసుకొని ధర పెరుగుదల కోసం ఎదురుచూపుల్లో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 40 శాతం కొనుగోళ్లు కూడా జరగలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో నూలు, వస్త్రాల ధరలు పడిపోవడం.. గింజలు, క్యాండీలకు డిమాండ్ తగ్గడం ప్రతికూలంగా మారింది. రష్యా – ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పత్తి మార్కెట్ పరిస్థితిపై పరిశీలన..

ఇళ్ల వద్దనే నిల్వ

ఉమ్మడి జిల్లాలో గడిచిన వానాకాలంలో పత్తి 3.50 లక్షల ఎకరాలకుపైగా సాగులోకి వచ్చింది. అతివృష్టి కారణంగా అపార నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఈ లెక్కన తక్కువలో తక్కువగా 8 లక్షల క్వింటాళ్లకుపైగా ఉత్పత్తులు వస్తాయని అంచనా. ప్రభుత్వం పత్తి నాణ్యమైన రకానికి రూ.6,380గా మద్దతు ప్రకటించగా సీజన్ ఆరంభంలో బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.9వేల పైచిలుకు చేరుకుంది. ప్రస్తుతం రూ.7,700 పడిపోయి ఊసూరుమనిపిస్తుంది. ఈ పరిస్థితి వల్ల రైతులంతా ధర పెరగవచ్చనే ఆశతో పత్తిని అమ్ముకోకుండా ఇళ్ల వద్దనే నిల్వ చేసుకున్నారు. దీని కారణంగా క్రయవిక్రయాలు ఆగిపోయి మార్కెట్ స్తంభించింది. నిజానికి ఇప్పటికే 90శాతం మేరకు కొనుగోళ్లు జరగాల్సి ఉండగా.. గతేడాదితో పోలిస్తే 40 శాతానికి మించలేదు.

సంగారెడ్డిలో 1.86 లక్షల క్వింటాళ్లు

సంగారెడ్డి జిల్లా పరిధిలో సదాశివపేట, రాయికోడ్, జోగిపేట, వట్‌పల్లి, నారాయణఖేడ్ ప్రాంతాల్లో ఇప్పటివరకు కేవలం 1.86 లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. సిద్దిపేట జిల్లా పరిధిలోని గజ్వేల్, సిద్దిపేట, చిన్నకోడూర్, తొగుట, కొండపాక, దౌల్తాబాద్, బెజ్జంకి, హుస్నాబాద్, చేర్యాల తదితర చోట్ల కేవలం 1.96 లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. గతేడాది జనవరి 30 నాటికి సంగారెడ్డి జిల్లా పరిధిలో 5.06 లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. అదేవిధంగా సిద్దిపేట జిల్లాలో ఈ సమయానికి 4.92లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. ఒకరకంగా చెప్పాలంటే అప్పటికే కొనుకోళ్లు పూర్తి కావచ్చాయి.

తగ్గిన క్యాండీ ధర

ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం కారణంగా అంతర్జాయ మార్కెట్‌లో పత్తికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. నూలు, వస్త్రాల ధరలు పతనమవడం ఆందోళనకరంగా పరిణమించింది. మరోవైపు గింజల ధర రూ.3,500కు పడిపోయింది. జిన్నింగ్ తర్వాత 356 కిలోల బరువుండే క్యాండీ గతేడాది రూ.90 వేల పైచిలుకు పలికితే నేడు రూ.62,000కు పడిపోయింది. పత్తి ధర్పై ఆశలతో రైతులు పత్తిని ఇళ్ల వద్దే నిల్వ చేసుకోవడంతో క్రయవిక్రయాలు మందకొడిగా సాగడానికి కారణమవుతోంది.

కొనుగోళ్లు మందకొడిగానే

అంతర్జాయంగా పత్తి మార్కెట్‌కు కొంత ప్రతికూల పరిస్థితులున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోకుండా నిల్వ చేసి పెట్టుకోవడం వల్ల లావాదేవీలు మందకొడిగా సాగుతున్నాయి. కొద్ది రోజుల తర్వాత కొనుగోళ్లు తిరిగి ఊపందుకునే అవకాశముంటుందని భావిస్తున్నాం.

– రియాజ్, ఉమ్మడి మెదక్ జిల్లా మార్కెటింగ్ అధికారి

క్లుప్తంగా

కేలండర్‌ ఆవిష్కరణ


ముదిరాజ్‌ సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న హోంశాఖ మంత్రి మహమూద్‌ అలీ

కొండపాక(గజ్వేల్‌): ముదిరాజ్‌ సంఘం కేలండర్‌ను హోం మంత్రి మహమూద్‌ అలీ ఆవిష్కరించారు. మంగళవారం ముదిరాజ్‌ యువ జన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి భానుకుమార్‌ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ కులస్తుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. మత్స్యసహకార సంఘంలో ముదిరాజ్‌లకు సభ్యత్వం కల్పించి చెరువుల్లో చేపలు పట్టుకొని అమ్ముకునేలా సర్కార్‌ అవకాశం కల్పించిందన్నారు. ముదిరాజ్‌ కులస్తులు మత్స్యసహకార సంఘాల్లో సభ్యత్వ తీసుకుని ప్రభుత్వ పథకాలకు అర్హులు కావాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ హైదరాబాద్‌ అధ్యక్షుడు మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు మంగళవారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్‌ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 23 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్‌బాబు రూ.54 వేల జరిమానా విధించారు.

పటాన్‌చెరుటౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 32 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 31 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ఒకరికి రూ.3 వేల జరిమానా విధించినట్లు పటాన్చెరు ట్రాఫిక్‌ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


లాలు (ఫైల్‌)

పటాన్‌చెరుటౌన్‌: చెన్నై వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైయ్యాడు. మంగళవారం పటాన్‌చెరు పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ వీకర్‌ సెక్షన్‌ కాలనీకి చెందిన లాలు వృత్తిరీత్యా డ్రైవర్‌. ఈనెల 23వ తేదీన చెన్నైకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో లాలు కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. భార్య లత పటాన్‌చెరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

ఎస్టీ బంధును ప్రకటించాలి

నారాయణఖేడ్‌: అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాల్లో ఎస్టీబంధును ప్రకటిండంతోపాటు సంత్‌ సేవాలాల్‌ మహారాజ్‌ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని లంబాడాహక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్‌ రాథోడ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆయన ఖేడ్‌లో మాట్లాడారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు.

పోలీసుల కార్డన్‌ సెర్చ్‌


కాడిపల్లిలో పోలీసులు సీజ్‌ చేసిన బైక్‌లు

పోలీసులు ఏకకాలంలో పలుచోట్ల కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు గ్రామాలకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వవద్దని హెచ్చరించారు.

కాడిపల్లి(నర్సాపూర్‌): మండల కేంద్రమైన కొడిపల్లిలో మంగళవారం ఉదయం నర్సాపూర్‌ సీఐ షేక్‌ లాల్‌ మదార్‌ ఆధ్వర్యంలో కొడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డితోపాటు 30 మంది పోలీసులు కొత్తకాలనీలో కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 23 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎస్పీ రోహిణి ప్రియదర్శని ఆదేశాలమేరకు సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా కొడిపల్లిలోని పలువురు ప్రజల ఇళ్లకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చోరీ చేసిన బైక్‌లు, మొబైల్‌ ఫోన్లు తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోలు చేయడం నేరమని, వీటివల్ల సమస్యలలో చిక్కుకుంటారని హెచ్చరించారు. ప్రజలు ప్రధాన కూడళ్లతోపాటు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్‌నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌లో పరిచయం లేని వ్యక్తులకు డబ్బులు పంపవద్దని, ఓటీపీలు చెప్పవద్దన్నారు. గ్రామాలలో అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

హైదర్‌గూడలో 27 ద్విచక్ర వాహనాలు, ఆటో సీజ్‌

తూప్రాన్‌: మున్సిపల్‌ పరిధిలోని 12వ వార్డు హైదర్‌గూడలో పోలీసులు మంగళవారం కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉంటే వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు. అనుమానితులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు వారి ఆధార్‌తో పాటు ఇతర గుర్తింపు కార్డులు కలిగి ఉన్న వారికే ఇవ్వాలని సీఐ శ్రీధర్‌ సూచించారు. సరైన పత్రాలు లేని 27 ద్విచక్రవాహనాలు, ఆటోను సీజ్‌ చేశారు. సరైనపత్రాలు చూపిన వారికి తిరిగి వాహనాలు హిస్తామన్నారు.


హైదర్‌గూడలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌

జప్తిశివునూర్‌లో..

రామాయంపేట(మెదక్‌): నార్సింగి మండలం జప్తిశివునూర్‌ గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్‌ నిర్వహించారు. రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు ప్రతీ ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలులేని 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించామన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్‌ రూల్స్‌ పాటించాలన్నారు. సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని, రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మరణిస్తే హత్యకేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని సీఐ కోరగా సర్పంచ్‌, గ్రామస్తులు విరాళాలు అందజేశారు. తనిఖీల్లో నార్సింగి, రామాయంపేట, చేగుంట, నిజాంపేట ఎస్‌ఐలు నర్సింలు, రంజిత్‌, శ్రీనివాసరెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌, సుభాశ్‌గౌడ్‌, సర్పంచ్‌ షేక్‌ షరీఫ్‌, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నిద్రరావడంలేదని ఓఆర్‌ఆర్‌పైకి వెళ్లి..

- ఫొటో తీసుకుని రోడ్డు దాటుతుండగా కారు ఢీ
- తీవ్రగాయాలై అక్కడికక్కడే వ్యక్తి మృతి


ముఖేశ్‌ మృతదేహం

పటాన్‌చెరుటౌన్‌: నిద్రరావడం లేదని తోటి స్నేహితుడిని తీసుకొని ఔటర్‌ రింగ్‌ రోడ్డుపైకి వెళ్లాడు. ఫొటోలు దిగి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం ఏడాది క్రితం ముఖేశ్‌(47), అతడి స్నేహితులు వచ్చారు. మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామ సమీపంలో ఉంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 30వ తేదీన కూలీ పనికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చారు. నిద్రరావడం లేదని రామేశ్వరం బండ సమీపంలో ఉన్న ఓఆర్‌ఆర్‌పైకి ఫొటోలు దిగేందుకు ముఖేశ్‌, అతడి స్నేహితుడు విజయ్‌ కలసి వెళ్లారు. ఫొటోలు దిగి తిరిగి రోడ్డు దాటుతుండగా శామీర్‌పేట్‌ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న కారు ముఖేశ్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలు ఢీ: పలువురికి గాయాలు


బోల్తా పడిన ఆటోలు

శివ్వంపేట(నర్సాపూర్‌): ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీ కొన్న సంఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధి తూప్రాన్‌–నర్సాపూర్‌ హైవే శభాష్‌పల్లి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెండి గ్రామానికి చెందిన గణేశ్‌ ఆటోలో తూప్రాన్‌ నుంచి పాలు తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో దొంతి గ్రామానికి చెందిన ఆటో తూప్రాన్‌ వెళ్తుండగా ఎదురెదురుగా ఢీ కొని బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో పలువురుకి స్వల్ప గాయాలయ్యాయి. చెండి గ్రామానికి చెందిన గణేశ్‌కు తీవ్రగాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కొంపల్లిలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.

బైక్‌ అదుపుతప్పి విద్యుత్‌ స్తంభానికి ఢీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

మెదక్‌ రూరల్‌: బైక్‌ అదుపుతప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మెదక్‌ మండలం మాచవరం శివారులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్‌ పట్టణం దాయర వీధికి చెందిన కుర్మ శేఖర్‌(35) వ్యవసాయం చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన బావ శ్రీశైలంతో కలిసి బైక్‌ పై మెదక్‌ నుంచి కొల్చారం మండలం చిన్నఘనపూర్‌ గ్రామానికి వెళ్తున్నాడు. మార్గం మధ్యలో మెదక్‌–నర్సాపూర్‌ జాతీయ రహదారిపై మాచవరం శివారులో బైక్‌ అదుపుతప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో శేఖర్‌ అక్కడికక్కడే మృతిచెందగా, శ్రీశైలంకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108 వాహనంలో మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బైక్‌ ఢీ కొని వృద్ధుడి మృతి


సత్తయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్‌): బైక్‌లు ఢీ కొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్‌ బస్టాండ్‌ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన ఎర్ర సత్తయ్య(60) బైక్‌పై మెదక్‌ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్‌ ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ ఢీ కొట్టిన వ్యక్తికీ తీవ్రగాయాలయ్యాయి. చిన్నశంకరంపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని, మృతుడిని మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు సత్తయ్యకు భార్య కిష్టమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు ముందు టైరు పగలడంతో..


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

- డివైడర్‌పైకి దూసుకెళ్లి మరో కారును ఢీకొన్న వైనం
- ఐదుగురికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం


క్షతగాత్రులను అంబులెన్సులో ఎక్కిస్తున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్‌): సిద్దిపేట నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న కారు ముందు టైరు పగిలింది. డివైడర్‌పై నుంచి దూసుకెళ్లి అవతలి వైపు హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వెళ్తున్న కారును ఢీ కొట్టడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌ గ్రామ శివారు రాజీవ్‌ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన నితిన్‌ పటేల్‌ టైల్స్‌ వ్యాపారి. మంగళవారం సిద్దిపేటలో టైల్స్‌ ఆర్డర్‌ తీసుకొని కారులో హైదరాబాద్‌ వెళ్తున్నాడు. ఈక్రమంలో ఇల్లంత కుంట మండలంలో జరుగుతున్న మల్లన్న సాగర్‌ పనుల నిర్వహణ కాంట్రాక్టర్లు పనిలో భాగంగా దమ్మాయి రాము, మజ్జి సత్యనారాయణ, మజ్జి అప్పారావు, కురువాడ గోవిందు కారులో హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వెళ్తున్నారు. ప్రయాణంలో కారు టైరు పగలడంతో డివైడర్‌పైకి దూసుకెళ్లి అవతల వస్తున్న కారును బలంగా ఢీకొట్టడొతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పుష్పరాజ్‌ సిబ్బందితో సంఘటనా స్థలానికి చురుకున్నారు. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కురువాడ గోవిందు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రేవేటు ఆస్పత్రికి తరలించారు. రాజీవ్‌ రహదారిపై అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


మంజీరా నదిలో తేలిన రమేశ్‌ మృతదేహం

మనూరు(నారాయణఖేడ్‌): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మంజీరా నదిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ లక్ష్మణ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పుల్‌కుర్తి గ్రామానికి చెందిన రమేశ్‌(37) తన తండ్రి అంబాజీతో కలిసి ఆదివారం మంజీరా నదిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. రమేశ్‌ తండ్రి సాయంత్రం ఇంటికి వచ్చినా, రమేశ్‌ చేపల వేట కొనసాగించాడు. అయితే రమేశ్‌ భార్య మాధవి ఫోన్‌ చేయగా కాసేపట్లో వస్తానని సమాధానం ఇచ్చాడు. తర్వాత ఫోన్‌ చేయగా స్విచ్‌ఆఫ్‌ వచ్చింది. దీంతో అనుమానం వచ్చి సోమవారం ఉదయం నది తీరంలో కుటుంబీకులు, స్థానిక జాలర్లు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మంజీరా నది ఒడ్డున రమేశ్‌ శవం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ లక్ష్మణ్‌ తన సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి శవమై తేలి..


కొంపల్లి బాలయ్య (ఫైల్‌)

దుబ్బాక: చెరువులో పడి గల్లంతైన వ్యక్తి శవమై తేలాడు. ఈ ఘటన రాయపోలు మండలం ఆరేపల్లిలో గ్రామంలో జరిగింది. మంగళవారం రాయపోలు ఎస్‌ఐ షేక్‌ మహబూబ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోలు మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి బాలయ్య (48) బంధువు దశదిన కర్మకు వచ్చాడు. సోమవారం స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులోపడి గల్లంతయ్యాడు. అతడి కోసం గజఈత గాళ్ల గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు అర్ధరాత్రి బాలయ్య మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టిన లారీ..

వ్యక్తికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్‌: ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన భానూర్‌– బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌ పల్లి మండల పరిధి షేర్‌ గూడ గ్రామానికి చెందిన వెంకటేశ్‌ తన బైక్‌పై మంగళవారం శంకర్‌ పల్లి వెళ్లాడు. తిరిగి బీడీఎల్‌ మీదుగా గ్రామానికి వెళ్తుండగా బీడీఎల్‌ సమీపంలో పటాన్‌చెరు నుంచి శంకర్‌ పల్లి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్‌ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం బీరంగూడలోని ప్రవేట్‌ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్‌ సోదరుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


ప్రసాద్‌ (ఫైల్‌)

హత్నూర(సంగారెడ్డి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపోషణ భారమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతల చెరువు గ్రామానికి చెందిన నీరుడి ప్రసాద్‌(30) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వచ్చే ఆదాయం చాలకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం లేచి మేక పిల్లలను బయట కట్టివేసి, కాలకృత్యాలు తీర్చుకుని గదిలోకి వెళ్లాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో తలుపులు తట్టి చూడగా గడియపెట్టి ఉండటంతో ఆందోళనగురైన భార్య శ్రీలత పక్కింటిలో ఉన్న కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. కుటుంబ సభ్యులు, ఇరుగురు పొరుగు వారు తలుపులు పగుల గొట్టి చూడగా ప్రసాద్‌ దూలానికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

గజ్వేల్‌రూరల్‌: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్‌ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌ రాష్ట్రం పాలి జిల్లా, రాయపూర్‌ తాలుకా పరిధి కాలకోట్‌ గ్రామానికి చెందిన సంగోటు ఉకుమ్‌సింగ్‌(21) గజ్వేల్‌లోని లోకేశ్‌ ఫ్యాషన్స్‌ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా లోకేశ్‌ దుకాణ యజమాని దిలీప్‌ ఇంట్లో నివాసముంటున్నాడు. ఉకుమ్‌సింగ్‌ రోజు మాదిరిగానే బట్టల దుకాణానికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చాడు. గదిలోకి వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన దిలీప్‌ కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో ఉరివేసుకుని కనిపించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అవకాడో సాగుతో ఆదాయం

ఐఐహెచ్‌ఆర్‌ ప్రిన్సిపల్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ జి.కరుణాకర్‌

సంగారెడ్డి టౌన్‌: అవకాడో పంట సాగుతో ఆదాయంతోపాటు ఆరోగ్యం లభిస్తుందని ఐఐహెచ్‌ఆర్‌ ప్రిన్సిపల్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ జి.కరుణాకర్‌, తమిళనాడు టీవీఎస్‌ఎస్‌ వీర అరసు ప్రోగ్రెసివ్‌ రైతు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో అవకాడో సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అవకాకడోను రైతులు విస్తృతంగా సాగు చేయాలన్నారు. కేన్సర్‌ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవడానికి అవకాడో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా గుండెపోటును తగ్గిస్తుందన్నారు. ఐదేళ్ల కాల వ్యవధి పంట ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, టెక్నికల్‌ అసిస్టెంట్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన అర్జున్‌

మెదక్‌జోన్‌: ఇంటర్‌ యూనివర్సిటీ అథ్లెటిక్‌ టోర్నమెంట్‌లో ఓ విద్యార్థి బంగారు పతకం సాధించాడు. మెదక్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కెతావత్‌ అర్జున్‌ సోమవారం హైదరాబాద్‌ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఇంటర్‌ యూనివర్సిటీ అథ్లెటిక్‌ టోర్నమెంట్‌లో క్రాస్‌ కంట్రీ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్‌ గణపతి మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 12న బెంగళూరులో జరిగే నేషనల్‌ యూనివర్సిటీ అథ్లెటిక్‌ చాంపియన్‌ షిప్‌ పోటీలకు అర్జున్‌ ఎంపికైనట్లు చెప్పారు.

బతికుండగానే చంపేశారు

- ఆస్తి కోసం తమ్ముడి మరణ ధ్రువపత్రం సృష్టి
- ఆలస్యంగా వెంకటాయిపల్లిలో వెలుగుచూసిన ఘటన
- రెవెన్యూ అధికారులను ఆశ్రయించిన బాధితులు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మల్లయ్య కుటుంబ సభ్యులు

తూప్రాన్‌: ఆస్తి కోసం తమ్ముడి మరణ ధ్రువపత్రం సృష్టించాడు ఓ అన్న. ఈ ఘటన మెదక్‌ జిల్లా తూప్రాన్‌ మండలంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన తొంట యాదయ్య, తొంట మల్లయ్య అన్నదమ్ములు. 25 ఏళ్ల క్రితం అన్న యాదయ్య నుంచి మల్లయ్య సర్వే నంబరు 135/4లో 5.50 గుంటల భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేశాడు. కానీ, రిజిస్ట్రేషన్‌ చేసుకోలేదు. అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే 2020 నుంచి ధరణి రికార్డుల్లో అన్న యాదయ్య పేరు మీదనే భూమి ఉంది. ఎలాగైనా ఆస్తిని కాజేయాలన్న కుట్రతో అప్పటికే మృతి చెందిన తండ్రి పేరు మీద ఉన్న మరణ ధ్రువపత్రంలో తప్పుడుగా చేర్పులు, మార్పులు చేసి తమ్ముడి మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించాడు. మీ సేవ ద్వారా తిరిగి భూమిని అన్న యాదయ్య తన పేరు మీద చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన తమ్ముడు మల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్‌ జ్ఞానజ్యోతిని నిలదీశారు. తాను బతికుండగానే తప్పుడు మరణ ధ్రువపత్రం సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్‌ ఎలా చేస్తారని ప్రశ్నించాడు. తప్పుడు ధ్రువపత్రం అని గుర్తించని కారణంగా ఇలా జరిగిందని, తిరిగి మీ సేవలో పీఎం–33 ప్రకారం సవరణ చేసుకునే అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకుంటే సవరణ చేస్తామని తహసీల్దార్‌ హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు సైతం న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించడంతో ఆందోళన విరమించారు.

అంతర్‌ రాష్ట్ర దొంగ అరెస్ట్‌

బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంతర్‌ రాష్ట్ర దొంగను రామచంద్రాపురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అతడి నుంచి బంగారు, వెండి ఆభరణాలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సీఐ సంజయ్‌ వివరాలు వెల్లడించారు. భారతీ నగర్‌ డివిజన్‌ పరిధి హెచ్‌ఐజీ కాలనీలో నివాసముండే నర్సింగరావు ఇంట్లో చోరీ జరిగింది. నర్సింగరావు కుమారుడు డ్యూటీకి వెళ్లి తెల్లవారుజామున 4 గంటలకు ఇంటికి వస్తాడు. బయట నుంచి తాళం తీసుకునే విధంగా ఇంటి సభ్యులు ఇంట్లో నుంచి తాళం వేసి నిద్రిస్తారు. జనవరి 4వ తేదీన 12 గంటలకు నర్సింగరావు లోపల నుంచి ముందు డోర్‌కి లాక్‌ చేసి నిద్రించాడు. తెల్లవారుజామున మేల్కొని వచ్చి చూడగా పడక గదిలోని సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు గ్రహించాడు. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ మొదలుపెట్టారు. విచారణలో భాగంగా చిలకలగూడకు చెందిన పాత నేరస్తుడు మంత్రి శంకర్‌ పై పోలీసులకు అనుమానం వచ్చింది. దాంతో నాటి నుంచి నిఘా పేట్టారు. ఎటికేల మంగళవారం చోరీకి పాల్పడిన మంత్రి శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి బంగారం, వెండి ఆభరణాలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. కాగా మంత్రి శంకర్‌ పై అన్ని కేసులతో పాటు, ఐదు పీడీ యాక్ట్‌లు, అనేకసార్లు జైలుశిక్ష అనుభవించి వచ్చాడని తెలిపారు. నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

న్యాయసేవలను గ్రామస్థాయికి విస్తరించాలి

జాతీయ మానవహక్కుల న్యాయసేవాసంఘం జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్‌

నారాయణఖేడ్‌: జాతీయ మానవ హక్కుల న్యాయసేవా సంఘం సేవలను గ్రామస్థాయికి విస్తరించాలని సంఘం జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్‌ అన్నారు. మంగళవారం ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్‌ సమావేశానికి హాజరై మాట్లాడారు. సభ్యులు క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ సేవలను విస్తృతం చేయాలన్నారు. అనంతరం సంఘం 2023 కేలెండర్‌ను ఆవిష్కరించారు.